"నేనే కరెక్టని చెప్పను. తప్పయితే సవరించుకోవటానికి సిద్ధంగా ఉన్నాను. మీరే ఆలోచించండి.. నిజంగా దేవుడు ఉంటే లోకంలో ఇంత ఆకలి ఎందుకుండాలి? అనారోగ్యం ఎందుకుండాలి? అసమానతలు ఎందుకుండాలి? ఇవన్నీ పూర్వజన్మలో చేసిన పాపఫలం అంటే నమ్మటానికి సిద్ధంగా లేను. ఒకవేళ అదే నిజం అనుకున్నా.. మనుషులు ఇన్ని పాపాలు చేస్తుంటే చూస్తూ ఊరుకుని, తరువాత జన్మలో శిక్షలు వేయటం న్యాయమెలా అవుతుంది? "

తన తల తిరిగిపోతున్నట్లు రెండుచేతుల మధ్యా తల పట్టుకుంది మాధవి. "ఏదో సినిమా కబుర్లు చెప్పుకుని పొట్ట పోసుకునే చిన్న జర్నలిస్టును నేను. నన్ను అనవసరంగా ఈ చర్చలోకి లాగకండి"

మళ్లీ నవ్వేశాడు ఆదిత్య. "నేను దేవుడిని తప్పు పట్టటం లేదు. చేతకానివాడు అంటున్నానంతే!"

"వ్వాట్? " పెద్దగా కేక పెడుతూ అంది మాధవి.

"చేతకాని వాడా..? "

"అవును. చేతకానివాడే! ఒక మంచి గృహిణి తన ఇంటిని చక్కదిద్దుకునేటంత నేర్పు కూడా ఆయనకి లేదు. ఒక మంచి వ్యాపారవేత్త వేలమంది ఉద్యోగులను ఎలా క్రమశిక్షణలో పెడతాడో చూసి నేర్చుకునే తెలివి లేదు. అన్నిటికీ మించి ఈ లోకాన్ని మరింత అందంగా, ఆహ్లాదంగా, బాధ్యతగా నిర్వహించాలన్న తపన లేదు. అందుకే నేను గుడికి వెళ్లను"

"దేవుడు కాక ఈ ప్రపంచాన్ని ఎవరు నడపాలంటారు? మీరయితే ఈ ప్రపంచాన్ని ఇంతకంటే మెరుగ్గా నిర్వహిస్తారా? "

"అనుమానం ఎందుకు? నూరుశాతం ఇప్పుడు ఈ ప్రపంచం నిర్వహించబడుతున్న తీరుకంటే బాగా నిర్వహిస్తాను" అంటున్న ఆదిత్య మాటల మధ్య అతని ఇల్లు వచ్చింది.

అందరూ కారు దిగారు.

"వీరిద్దరినీ ఇంటి దగ్గర డ్రాప్ చేసి నువు మీ ఇంటికి వెళ్ళు" తన కారు డ్రైవర్‌తో చెప్పాడు ఆదిత్య.

"అయ్యో! వద్దండీ.. మేము వెళ్ళగలం" అంది మాధవి.

"అలా మిమ్మల్ని ఒంటరిగా వదిలెయ్యటం ఆ దేవుడు చేసేపని. ఆదిత్య చేసే పనికాదు" అని నవ్వుతూ లోపలికెళ్లాడు.

★ ★ ★

తెల్లవారింది.

అయినా ఇంకా బద్ధకం వదలక కళ్ళు తెరవకుండా మంచం మీదే అటూ ఇటూ దొర్లుతున్నాడు ఆదిత్య.

ఇంతలో తనని ఎవరో తట్టినట్లనిపించి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. ఎదురుగా ఎవరో పరిచయం లేని వ్యక్తి నిలబడి ఉన్నాడు.

"హేయ్! ఎవరు నువ్వు? " తన పడక గదిలో కొత్తవ్యక్తిని చూసేటప్పటికి కలిగిన ఆశ్చర్యం నుండి తేరుకోలేక కేక వేసినట్లు అడిగాడు ఆదిత్య.

ఎదుటి వ్యక్తి ఏమాత్రం అలజడి లేకుండా "నాపేరు సహదేవుడు" అన్నాడు.

"నేను అడుగుతున్నది నీ పేరు కాదు. అసలు ఇక్కడకు ఎలా వచ్చావని? " గొంతులో కోపం ఉట్టిపడుతుంటే అన్నాడు ఆదిత్య.

ఇంతలో ఏదో అనుమానం వచ్చి అటూ ఇటూ చూశాడు. మంచంపైన తన పక్కన ఉండవలసిన సుమ లేదు. దాంతో అతని ఆందోళన మరింత ఎక్కువయింది.

అతని అనుమానం అర్థమైనట్లు "ఆమెను ఎవరూ ఎత్తుకుపోలేదు. నిద్రలేచి బయటకు వెళ్ళిందంతే!" చెప్పాడు సహదేవుడు.

ఎదుటివ్యక్తి మాట, ప్రవర్తన ప్రశాంతంగా ఉండటంతో ఆందోళన తగ్గించుకున్న ఆదిత్య లేచి కూర్చున్నాడు. "మా ఆవిడేమన్నా నిన్ను కొత్తగా పనిలోకి తీసుకుందా? " సహదేవుడ్ని పరీక్షగా చూస్తూ అడిగాడు.

ఆదిత్యకి ఎదుటి వ్యక్తిని చూస్తుంటే గట్టిగా కోప్పడాలనిపించటంలేదు. నల్లని జుట్టు నున్నగా దువ్వి ఉంది. పైన లాల్చీ, కింద పైజమా- తెల్లగా, వదులుగా వేలాడుతున్నాయి.

"లేదు. నన్నెవరూ పనిలోకి తీసుకోలేదు. నేనే వచ్చాను" క్లుప్తంగా చెప్పాడతను.

"మరి ఇలా అనుమతి లేకుండా లోపలకు ఎలా రాగలిగావ్? "

"నేను ఎక్కడికైనా వస్తాను. నన్ను దేవుడు పంపాడు"

"దేవుడా? ఆ పేరెప్పుడూ వినలేదే? ఎవరాయన? "

"దేవుడంటే నిజం దేవుడు" చేయి పైకి చూపిస్తూ చెప్పాడు అతను.

మొదటిసారి ఆదిత్యకి అనుమానం వచ్చింది, తనేమైనా పిచ్చోడితో మాట్లాడుతున్నానా? అని.

అతని మనసులో మాట అర్థమైనట్లు సహదేవుడు నవ్వి "నేను పిచ్చివాడిని కాదు.. అబద్ధం చెప్పటం లేదు. నిజంగా దేవుడు పంపితే వచ్చినవాడినే!" అన్నాడు.

అతని మాటలు విన్న ఆదిత్యకి ఇంకా నమ్మకం కలుగలేదు. 'అనుమానం లేదు, ఇతను పిచ్చివాడే' అనుకున్నాడు.

అందుకే కంగారు అణచుకుంటూ "సుబ్బయ్యా!" అని కేక పెట్టాడు.

సుబ్బయ్య అతని ఇంట్లో పనివాడు.

పరుగెత్తుకుంటూ వచ్చిన సుబ్బయ్యకి సహదేవుడ్ని చూపిస్తూ "ఇతన్ని బయటికి తీసుకువెళ్ళు" అన్నాడు ఆదిత్య.

ఆదిత్య చేత్తో చూపిస్తున్న వైపు చూసిన సుబ్బయ్యకి అక్కడ ఎవరూ కనపడలేదు. ఏమి జరుగుతుందో అర్థంకాక బిత్తరచూపులు చూస్తూ నిలబడ్డాడు సుబ్బయ్య.

"అతన్ని బెదరకొట్టకు. నేను ఎవరికీ కనపడను, నీకుతప్ప. అంతేకాదు, నా మాటలు కూడా ఎవరికీ వినపడవు" మళ్లీ చెప్పాడు సహదేవుడు.

"ఎందుకు స్వామీ! నాకే ఈ అదృష్టం కల్పించారు? " వ్యంగ్యంగా అడిగాడు ఆదిత్య.

"చెప్తాను, ముందు అతన్ని బయటకు పంపు"

గాలిలోకి చూస్తూ మాట్లాడుతున్న ఆదిత్యను విచిత్రంగా చూస్తూవుండిపోయాడు సుబ్బయ్య. సినిమా రిలీజ్ రోజు ఆదిత్య అతిగా స్పందించటం మామూలే! ఈరోజు అది మరీ శృతిమించినట్లు కనిపిస్తోంది. ఏమి చెయ్యాలో అర్థంకాక అలాగే నిలబడిపోయాడు సుబ్బయ్య.

జరుగుతున్న సంఘటన కల కాదని నిర్ధారణ చేసుకోవటానికన్నట్లు తనను తాను గట్టిగా గిచ్చి చూసుకున్నాడు ఆదిత్య. చురుక్కుమంది. అతను మెల్లగా సుబ్బయ్య వైపు తిరిగి "త్వరగా కాఫీ పట్టుకురా!" అన్నాడు.

ఇంతలో ఏదో గుర్తుకు వచ్చినట్లు "రెండు కప్పులు" అని చెప్పాడు.

బయటకు నడవబోతున్న సుబ్బయ్య మళ్ళీ ఒకసారి చుట్టూ గదినంతా పరీక్షగా చూసి, అక్కడ ఎవరూ లేరని కన్ఫర్మ్ చేసుకుని వెళ్ళిపోయాడు.

ఆదిత్యకి ఇంకా అయోమయంగానే ఉంది. దేవుడేమిటో.. తన దగ్గరికి ఇతన్ని పంపడమేమిటో.. అతనికి ఏమీ అర్థం కావటం లేదు.

అతని అసహనాన్ని ఇంకా పెంచుతూ, "నేను కాఫీ తాగను" దగ్గరలోని కుర్చీలో

కూర్చుంటూ అన్నాడు సహదేవుడు.

"మరేమి తాగుతారు? "

"నేనేమీ తాగను. నాకు ఆకలి వేయదు. నేను నీకోసం వచ్చాను. నువు లేచి బయలుదేరితే బయటకు వెళ్దాం"

"బయటికంటే ఎక్కడికి? "

"నీ ఇష్టం వచ్చిన చోటుకే వెళ్దాం"

"ఇంతకీ దేవుడు మిమ్మల్ని నా దగ్గరికి ఎందుకు పంపాడు? "

"ఈ లోకాన్ని నువ్వెలా మారుస్తావో చూసి, నేర్చుకు రమ్మని పంపారు"

"మీరేదో జోక్ చేస్తున్నారు. నేను లోకాన్ని మార్చటం ఏంటండీ!"

"రాత్రి అన్నావట కదా! ఒక ఛాన్సిస్తే ఈ లోకాన్ని దేవుడి పరిపాలన కంటే బాగా నడిపి చూపిస్తానని. అందుకే నీకు ఒక ఛాన్సిచ్చి, ఏమి చేస్తావో చూసి రమ్మని పంపారు"

"ఓహో! టీవీ ఛానెల్ నుండి వచ్చారన్న మాట. రాత్రి మాధవి చేసిన ఇంటర్వ్యూ చూసి వచ్చుంటారు! అవునా? "

"కాదు, నేను అసత్యం చెప్పను. దేవుడి దగ్గర నుండే వచ్చాను"

ఇంతలో సుబ్బయ్య రెండు కాఫీ కప్పులు పట్టుకు వచ్చాడు.

ఇంకా గాలితో చర్చని కొనసాగిస్తున్న ఆదిత్యని చూసి గట్టిగా నిట్టూర్చాడు సుబ్బయ్య.

ఒక కాఫీ కప్పు ఆదిత్యకి ఇచ్చి రెండో దాన్ని ఏమి చెయ్యాలో అర్థం కానట్లు పట్టుకుని నిలబడ్డాడు. అతని చేతులు వణుకుతుండటంతో కప్పు, సాసర్ కొట్టుకుని 'టకటక' శబ్దం వస్తోంది.

సహదేవుడి వైపు చూశాడు ఆదిత్య.

వద్దన్నట్లు తల అడ్డంగా ఊపాడు సహదేవుడు.

"దానిని నువ్వేతాగు" రెండో కప్పు చూపిస్తూ అన్నాడు ఆదిత్య.

సుబ్బయ్య చేతిలోని కప్పు చేస్తున్న శబ్దం ఇంకా ఎక్కువయింది. అయోమయంగా చూస్తూ భయం భయంగా ఆ కప్పు అలాగే పట్టుకుని బయటకు నడిచాడతడు.

ఆదిత్య మంచం మీద నుండి లేవకుండా కాఫీ సిప్ చేస్తూ "అయితే నిజంగా ఆ దేవుడే మిమ్మల్ని పంపాడంటారూ!" అన్నాడు.

"ఇంకా అనుమానం పోలేదా? "

"నేను అంత త్వరగా దేనినీ నమ్మను"

"రుజువు లేనిదే నువు దేనినీ నమ్మవు కదూ!" సాలోచనగా అన్నాడు సహదేవుడు.

"నిజంగా మీరు సహ'దేవుడే' అయితే రుజువు చెయ్యటం ఎంతసేపు చెప్పండి? " 'దేవుడే' అన్న మాటను ఒత్తి పలుకుతూ అన్నాడు ఆదిత్య.

ఆదిత్య పడుకుని ఉన్న మంచం పక్కనే ఒక టేబుల్ ఉంది. దాని మీద ఆ రోజు దినపత్రికలు పెట్టి ఉన్నాయి. అందులో ఒక దినపత్రిక తీసి వెనుక పేజీ చూశాడు సహదేవుడు. ఆ రోజు రిలీజవుతున్న ఆదిత్య నటించిన సినిమా తాలూకూ ప్రకటన ఉంది.

"వీళ్ళు ఎవరు? " ఆ ప్రకటనలోని ఫొటోలను చూపిస్తూ అడిగాడు సహదేవుడు.

"హీరోయిన్, ప్రొడ్యూసర్, డైరెక్టర్.." చెప్పాడు ఆదిత్య.

"వారిలో ఎవరో ఒకరికి ఫోన్ చెయ్!"

"ఎందుకు? "

"చెయ్యి.. చెప్తాను"

"హీరోయిన్ నిద్ర లేచిందో లేదో తెలియదు. ప్రొడ్యూసర్ టెన్షన్‌తో నిద్రపోయాడో లేదో తెలియదు. అందుకని డైరెక్టర్‌కి చేస్తాను" నవ్వుతూ అని ఫోన్ డయల్ చేసి సహదేవుడి వైపు ప్రశ్నార్థకంగా 'తర్వాత ఏమిటి? ' అన్నట్లు

చూశాడు.

"అతని జేబులో నుండి చేతికి వచ్చిన నోటు తియ్యమను"

ఆదిత్య డైరెక్టర్‌తో అదే చెప్పాడు.

"దాని నెంబర్ చెప్పమను..."

అవతల పక్కనుండి డైరెక్టర్ నెంబర్ చెప్తున్నట్లున్నాడు. దానిని నోట్ చేసుకోవ టానికి పెన్ను కోసం వెతుకుతున్నాడు ఆదిత్య.

"ఏమిటి వెతుకుతున్నావ్? "

"పెన్ను.."

"అక్కరలేదు. నీ అరచెయ్యి చూసుకో"

అరచెయ్యి చూసుకున్న ఆదిత్యకి అక్కడ ఒక నెంబర్ కనిపించింది. మరోసారి డైరె క్టర్‌ని నోటు నెంబర్ చెప్పమని, దానిని అరచేతిలో రాసుకోబోయాడు. కానీ ఆశ్చర్యం! అది తన చేతిలో ఉన్న నెంబరే!

ఆదిత్య అదెలా జరిగిందో అర్థంకాక నిజంగా ఆశ్చర్యపోయాడు.

"ఇప్పటికయినా నమ్మినట్లేనా? " అడి గాడు సహదేవుడు.

"ఇలాంటి ట్రిక్కులు ఇంద్రజాలికులు కూడా చేస్తారు"

విసుగ్గా తల అడ్డంగా ఊపాడు సహదే వుడు. "నువ్వు నీ సమయాన్ని వృథా చేసు కుంటున్నావు. దేవుడు నీకు అపూర్వమ యిన అవకాశం ఇచ్చాడు. దానిని ఉపయో గించుకుని నువ్వు చేయాలనుకున్నది చేసి చూపించు" అన్నాడు.

ఆదిత్య మరి రెట్టించకుండా గబగబా తయారయి బయలుదేరాడు.

"ఇంత ఉదయాన్నే ఎక్కడికి వెళ్తు న్నారు? ఇవాళ షూటింగ్ కూడా లేదుగా!" ఎప్పుడూ లేనిది అంత పొద్దున్నే బయటకు బయలుదేరిన భర్తను అడిగింది సుమ.

"నా సినిమా రిలీజ్ అవుతోందిగా! థియేటర్లో జనాల రెస్పాన్స్ చూసి వస్తా ను" అని ఆమె రియాక్షన్‌కోసం ఆగకుండా

## 'చతుర'లో రెండో నవల



**పుట్టగంటి గోపీకృష్ణ**

గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కొల్లూరులో 48 ఏళ్ల క్రితం జన్మించాను. సిండికేటు బ్యాంకులో ఉద్యోగం. ప్రస్తుతం డెప్యుటేషన్ మీద కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జనరల్ మేనేజర్‌గా వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను.

ఇంతకుముందు 'పులిజూదం' నవల 'చ తుర' జనవరి 2012 సంచికలో ప్రచురిత మైంది. ఇప్పటి వరకు మొత్తం పది నవలలు రాశాను.

ఏ కళకయినా పరమావధి పదిమంది ఆదరణ పొందడం. కథ, నవలా సాహిత్యం ఏ రూపంలో ఉన్నప్పటికీ ఎక్కువమందిని చదివింపజేస్తేనే దాని ప్రథమ ధ్యేయం నెర వేరినట్లని నేను భావిస్తాను. అందుకే విషయం గంభీరమైనదైనా చదివించేందుకు కథనంలో సరళత్వాన్ని పాటించాను.

మృగ్యమైపోతున్న జీవజాతులకు ఇస్తున్న ప్రాధాన్యం, లుప్తమైపోతున్న మానవ విలు వలకు ఇవ్వడంలేదన్న ఆందోళనతో రాసిన ఈ నవల ఎంతవరకు సఫలీకృతమయిందో పాఠకులే చెప్పాలి.


చిరునామా :

**పుట్టగంటి గోపీకృష్ణ**
ఫ్లాట్ నెం 205,
ద్వారక అపార్ట్‌మెంట్స్,
హిమాలయ హాస్పిటల్ ఎదురు,
యర్రముక్కపల్లి,
కడప - 516001